# 15. గుప్తం

బస్సులోంచి జనం అంతా దిగిపోయేరు.

"సింహాచెలం... సింహాచెలం' అంటూ కండక్టరూ దిగిపోయేడు.

బేగ్ తీసుకుని పద్మ హుషారుగా బస్సు దిగింది. బస్ కాంప్లెక్స్ నిండా జనం. ఆ జన సందోహంలో ఎటుపోవాలో తెలీక దిక్కులు చూసింది. మైకులో అప్పటివరకూ వస్తున్నసంకీర్తన ఆగింది. ఎవరో గొంతు సవరించుకున్న సవ్వడి – "ఈ రోజు కనుమ పండుగ సందర్భంగా స్వామివారు కొద్దిసేపట్లో కొండపైనుంచి పూలతోటలోకి వేంచేస్తున్నారు. భక్తులంతా అక్కడ నిరీక్షించండి" – పద్మ ప్రమేయం లేకుండానే జనం ఆమెను నెట్టుకుని పోవడం మొదలుపెట్టేరు.

పద్మ టైం చూసుకుంది. ఆరున్నర, శీతాకాలం పొద్దు – చీకటి దట్టమైంది. కాంప్లెక్స్ లోంచి రోడ్డుమీదికొచ్చాక పక్కకి తప్పుకోవాలని ప్రయత్నించింది. ఆ ఇరుకు మార్గంలో సాధ్యం కాలేదు. రోడ్డుపైనా, పక్కలా చల్లిన బ్లీచింగ్ పౌడరు వాసన, మరోవైపు యూరినల్స్ వాసన ముక్కు పుటాల్ని బద్దలు చేస్తున్నాయి.

"ఎలాగెల్లాలి?" అడుగుతున్నారెవరో.

"ఇదేటి, ఎడంపక్క పాత బస్టేండులోంచి ఆ పైకి పారుగా మెట్లెక్కితే అదే పూల్తోట" – 'కొండ మధ్యలో పూలతోట కాబోలు!' అనుకుంది పద్మ. అక్కడొకటి అక్కడొకటి డిమ్‌గా వెలుగుతున్న లైట్లు.

తిరుమలతో పోల్చుకోబోయి మానుకుంది.

మెరిసే చీరలు, నగలు అలంకరించుకున్న స్త్రీలు పౌడరు ఘుమఘుమల్తో... ఆ వెనక సెంటు పరిమళాల అబ్బాయిలు అమ్మాయిలమీద కామెంట్స్ విసురుతూ, బస్సుల్లోంచి దిగిన జనం వాడిన మొహాల్తో అందరూ పూలతోట వైపు నెట్టుకుని పోతున్నారు.

ఆ ఇరుకులోనే బూరల, బుడగల షాపులవాళ్లు పిల్లల్ని ఆకర్షించడానికి రకరకాల చప్పుళ్లు చేస్తూ అరుస్తున్నారు. అంతా తీర్థ వాతావరణం, ఎక్కడైనా భార్గవ కన్పిస్తాడా అని పరిశీలనగా చూస్తోంది పద్మ. భార్గవ్... ఇలాంటి చోటా...?

మెట్లదారి ఒక పురాతనమైన పూలతోటలోకి దారితీసింది. మెట్ల పక్కన అక్కడక్కడ లోవోల్టేజి దీపాలు... సన్నని సంపెంగ పరిమళం నాసికాపుటాల్ని హాయిగా తాకింది.

మెట్ల కిరువైపులా ఎత్తుగా పెరిగిన సంపెంగ చెట్లు, పోకచెట్లు, వాటివెనుక పచ్చని తుప్పల మీద కాగడా మల్లెపూలు తెల్లని నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

కొంచెం పైకి వెళ్తే ఆదరణ సరిగా లేని గులాబి తోటలో అక్కడక్కడ విరిసిన పూలు. మరికొంత పైన కృష్ణ తులసి వనం. ఈ సందర్భంగా తప్పనిసరై తుడిచి నట్టున్నారు. ఎక్కడికక్కడ ఎండిన ఆకుల గుట్టలు. దూరంగా ఎప్పుడో ప్రాచీనకాలంలో నిర్మించిన పనిచెయ్యని ఫౌంటెన్లు. వచ్చిన సందర్భాన్ని వదులుకోకూడదని అన్నిట్నీ పరిశీలిస్తూ నడుస్తోంది పద్మ.

కొంత పైకెళ్లాకా కుండంలాంటి చిన్నకోనేరు. కొండపైనుంచి స్వయం భూధారట, సన్నని ధార వచ్చి కోనేట్లో పడుతోంది. జనం అక్కడికెళ్లి నీళ్లు నెత్తిన చల్లుకుని వస్తున్నారు. మరికొంచెం మెట్లెక్కి వెళ్తే సీమ సున్నంతో నిర్మించిన పురాతన మంటపం ఉంది. కొండపైన ఎక్కడినుంచో చందన పరిమళం వచ్చి కమ్ముకుంటోంది.

"దేవుణ్ణి తీసుకెళ్లిపోయేరు... దేవుణ్ణి తీసుకెళ్లిపోయేరు" అంటూ జనం అంతా వెనక్కి తిరగడం మొదలుపెట్టేరు. ఆ మంటపంలో పూజ జరిగిన గుర్తుగా పూలు, అక్షింతలు వున్నాయి. జనం ఆ పూల కోసం, అక్షింతల కోసం ఎగబడ్డారు.

"పరిగెట్టండి, కింద కొత్త కళ్యాణమండపంలో ఉంటాడు దేముడు" అన్నారెవరో. వెనక్కి ఒకటే తొక్కిసలాట మొదలైంది.

జనంతో బాటు ఎక్కిన మెట్లన్నీ దిగి రోడ్డు మీదికొచ్చి పడింది పద్మ. నాలుగు రోడ్ల కూడలి దగ్గరికొచ్చాక ఎలాగో తప్పించుకొని రోడ్డుపక్క ఆగిపోయింది.

"దేవుడు కొత్తకళ్యాణ మండపం నుంచి ఊరేగింపుగా బయల్దేరాడు" అని మైకులో వినపడింది. జనం ఎక్కడి వాళ్లక్కడే ఆగిపోయారు.

ఎదుటి వీధిలోంచి బోయీలు మొయ్యలేక మోస్తున్న బల్లపరుపు పల్లకీ ఒకటి తొందరతొందరగా బైటికొస్తోంది. దానిపైన నీలిరంగు పూసిన పెద్ద చెక్క ఏనుగు, ఆపైన వరాహమూర్తి ఉత్సవ విగ్రహం నాలుగు చేతుల్తో. వాహనం పక్కన ఒకే ఒక్క గేస్‌లైటు. ఆ వెలుగులో వెల వెల బోతున్న దేవుడు. పల్లకీ పైన రెండువైపులా కూర్చున్న పూజారులు

దగ్గరకొచ్చి మొక్కుతున్న వాళ్లనెత్తిన వస్త్రంతో మూసికట్టిన శఠగోపంతో ఖంగుఖంగున మోదుతున్నారు. నెత్తి తడుముకుంటూ వెనక్కి వస్తున్న భక్తుల్ని చూస్తుంటే పద్మకి నవ్వొచ్చింది.

పశ్చిమాకాశంలో శుక్రగ్రహం జ్వాజ్వల్యమానంగా వెల్గుతోంది. కోనేటికి దారి, అని బోర్డు వున్నవైపు మళ్లింది ఊరేగింపు. ఆ వీధి చాలా ఇరుకుగా మురికిగా వుంది.

"కోనేటి దాకా ఎల్లి దేముడు అయిదు నిమసాల్లో ఎనక్కొచ్చేత్తాడు. ఈ ఏడు అమ్మకాలేటీ నేకుండా పోనాయి" అంటున్నాడు బొమ్మల కొట్టువాడు పక్కవాడితో.

'ఏటి, సార్జీలన్నా వత్తాయేటీ ఈ యమ్మకాల్తో, థూ... ఆడమ్మాతీర్థం" అని నోట్లో బీడీ పక్కకి తీసి తుపుక్కున రోడ్డుమీద ఉమ్మేడు బూరాల కొట్టు వాడు. తిరుమల వైభవాన్ని తరచుగా చూసిన పద్మకి ఇదంతా 'రాజుని చూసిన కళ్లకి...' అన్నట్టుంది.

తిరుమలలో ఉత్సవమూర్తికి అలంకరించే వజ్రాల నగలు, కిరీటం, ఆ దీపమాలల జ్వాజ్వల్యం - ఆ వైభవమే వేరు. సింహాచల క్షేత్రంలో జరిగిన ఆభరణాల అపహరణ గురించి పెద్దవాళ్లు చెప్పుకోగా విన్నది గుర్తుకొచ్చింది. అదిసరే, ఇక్కడింత సందడి జరుగుతున్నా భార్గవ్ ఆచూకీ లేదేమిటి? అతను ప్రత్యేకించి వేదం చదువుకున్నది ఇక్కడి ఆలయంలో పురోహితుడిగా స్థిరపడాలనే కదా?... అయినా పురోహితులంతా ఊరేగింపుల్లో పాల్గొనాలనేముంది? కొండపైన ఆలయంలో ఉండి ఉండచ్చుకదా! అతన్ని సర్ప్రైజ్ చెయ్యాలని తనిలా చెప్పాపెట్టకుండా రావడం మంచిదేనా కాదా.... అని డైలమాలో పడింది పద్మ.

పర్స్‌లో ఉన్న ఎడ్రస్ కాగితాన్నిజాగ్రత్తగా పైకి తీసింది. రెండేళ్లుగా ఆ కాగితాన్ని నలగనీకుండా భద్రంగా కాపాడుకుంటూ వస్తోంది.

'భార్గవశాస్త్రి, కేరాఫ్ / హెచ్.శ్యామ వరాహ శాస్త్రి, 4-44, చంద్రాగార్డెన్స్, సింహాచలం' - గుండ్రని ముత్యాల్లాంటి అక్షరాలు.

"సింహాచలం బస్టాప్‌లో దిగి పది రూపాయలిస్తే ఆటోవాడు తిన్నగా మా ఇంటిముందుకు తీసుకొచ్చి దించుతాడు" అని ఆ రోజు పిన్నితో భార్గవ్ అనడం గుర్తుకొచ్చింది.

టైం తొమ్మిదైంది. ఇంత పొద్దుపోయి వెళ్తే వాళ్లమ్మగారూ వాళ్లూ ఏమైనా అనుకుంటారేమో, అసలే వాళ్లది ఆర్థడాక్స్ కుటుంబం అట!

ఎంక్వైరీ బోర్డు ఉన్నచోటకెళ్లి దేవస్థానం గెస్ట్ హౌస్‌లో రూం కోసం అడిగింది.

వెంటనే "లేవమ్మా ఇయ్యాల కనం పండగ్గదా, ఒరియన్లు వొచ్చీసేరు. అన్నింట్నిండా ఆళ్లే" అన్నాడు కౌంటర్లో వ్యక్తి.

పద్మ ఆటోని పిల్చి ఎక్కి "చంద్రాగార్డెన్స్" అంది. దేవుడి ఊరేగింపు వెళ్లొచ్చిన కోనేటి ఇరుకు వీధిలో బయలుదేరింది ఆటో. వీధిని కట్‌చేస్తూ కోనేటి గట్టు. గట్టుముందు ఎడం వైపు మళ్లీ ఊగిపోతూ నడుస్తోంది ఆటో. పెద్ద పెద్ద గోతులదారి. ఆటోలో ఎగిరి పడుతోంది పద్మ. కుడివైపు ఎత్తయిన ప్రహరీ, ఎడమవైపు కొబ్బరి తోట, పదినిమిషాల తర్వాత ఎడంపక్కకి మళ్లీ తోటలోకి దారి తీసింది. సన్నని కాలిబాట మీద ఒరిగిపోయి వెళ్తోంది ఆటో. చిమ్మచీకటి, ఏదో భయంతో ఒళ్లు జలదరించింది పద్మకి.

"ఇదే సెంద్రా గార్డెన్సు" అన్నాడు ఆటో అతను. 'హమ్మయ్య' అనుకుంది పద్మ.

ఆటోలోంచి తల బైటికి పెట్టి చూసింది. అక్కడొకటి అక్కడొకటి అరమైలు కొకటి చొప్పున విసిరేసినట్టున్న అయిదారిళ్లు బాటకి దూరంగా.

"ముందన్నీ జిల్లేడుసెట్లు, ముళ్లకంపలు, లోపలికి కూకో" గదిమినట్టు అన్నాడు.

వెలుగులో తను చూసిన ఆటో అతని ముఖాన్ని గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తోంది పద్మ. ఒంటరిగా ఈ చీకట్లో ఇలా రావడం తప్పేమో! చంద్రాగార్డెన్స్ అంటే ఏదో కాలనీ అనుకుంది తను. దట్టమైన అడవిలో ప్రయాణిస్తున్న భావన. 'భార్గవా, ఎక్కడున్నావోయ్' అనుకుంది మనసులో.

"ఎవులింటికి?"

"వ...వ్వ.... వరాహశాస్త్రిగారింటికి"

ఆటో తుప్పల్లోంచి ఏవో పెద్ద పెద్ద మానులున్న చెట్లలోకి మళ్లింది. ఆటో చప్పుడుకి కాబోలు చెట్ల మీది పక్షులు ఒక్కసారిగా అరుస్తూ కకావికలయ్యాయి. అప్పుడే పైనుంచి ఆటో టాపుమీద టపటపమని ఏవో జలజలరాలిన సవ్వడి. "ఏమిటవి?" అంది భయం భయంగా పద్మ.

"సింతకాయలు, ఇయ్యన్నీ సింతమానులే గాదా" అన్నాడు. ఆటో ఆ మానుల మధ్యనుంచి కొంతదూరం నడిచి ఆగిపోయింది.

"ఏమైంది?" అంది పద్మ. తనగొంతు తనకే ఏదోలా వినపడింది. అంత చలిలోనూ ఒళ్లంతా చెమటలు పోసాయి.

"ఇంకముందుకెల్లదు, నడిసెల్లిపో, ఆ సెట్ల కవతల తెల్లగా కనపడేదే ఆరిల్లు"-

పద్మ ఒక నిట్టూర్పు విడిచింది.

"పాతికి" అన్నాడు ఆటో అతను. మారు మాట్లాడకుండా పర్సులోంచి మూడు పదులు తీసి ఇచ్చింది.

"సిల్లర్నేదు"

"ఫరవాలేదు ఉంచుకో. ఒక చిన్న రిక్వెస్టు. నేను అక్కడికెళ్లేవరకూ ఇక్కడే ఉండేం. ఏంలేదూ... ఈ చీకట్లో..."

"సరే ఎల్లు" అన్నాడు. ఆటో లైటు వెలుగులో దారికిరువైపులా పెద్ద పెద్ద పుట్టలు, ఇంకా ఇంటి వాకిట్లోకి చేరుకోనేలేదు, రయ్యిన ఆటో మళ్లించుకుని వెళ్లిపోయేడు.

చీకట్లో ఒకే ఒక ఇల్లు. పద్మ ఒక్క అంగలో గేటు గడియ తీసుకుని లోపలికెళ్లింది. ఎడమ వైపు సింహాద్రి మీద వెలుగుతున్న విష్ణునామం, శంఖు చక్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

లోపల్నుంచి ఎలాంటి అలికిడీ లేదు. పర్వదినం కదా, ఒకవేళ అందరూ కొండపైకి వెళ్లుండాలి. బైట ఒక దీపమైనా వెలిగించుకోరూ! అబ్బో.... వాళ్లొచ్చేవరకూ ఈ చలిలో కూర్చోవాలా అనుకుంటూ మెట్టుమీద కూర్చుని తలుపుకి చేరబడబోయింది. అది లోపలికి తెరుచుకుంది. పద్మ లేచి నిలబడి "ఏమండీ" అని పిల్చింది. ఎవరూ పలకలేదు లోపలంతా చీకటి.

"భార్గవ్" మళ్లీ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం పద్మని మరింత భయపెట్టింది. తన గుండె చప్పుడు తనకే స్పష్టంగా వినపడుతోంది. పోనీ తిరిగి వెళ్లి పోదామా అంటే దారీ తెన్నూలెదు.

గుండె దిటవు చేసుకుని గోడపైన వెతికి స్విచ్ నొక్కింది. బెడ్‌లైటు చిన్నగా వెలిగింది. గదిలో మరిబల్బులు లేవని అర్థమైంది. మడత మంచం ఒకటి వాల్చి ఉంది. పాతకాలం నాటి కుర్చీ, టేబులు, టేబులుమీద ప్లాస్టిక్ సీసాతో నీళ్లు, పక్కనే సొట్టలు పడిన స్టీలు గ్లాసు, ఈ గదిలోంచి లోపలికెళ్లే తలుపు తాళం వేసుంది. పద్మకంతా అయోమయంగా ఉంది. ఒకపక్క ఆకలి దంచేస్తోంది. తను రోడ్డు పక్కన నిలబడినప్పుడు ఎవరో చేతికిచ్చిన ప్రసాదం పేకెట్టు పర్స్‌లో పెట్టుకోవడం గుర్తుకొచ్చి పైకి తీసింది. దానిలో ఓ గుప్పెడు పుల్హొర, ఓ అరటిపండు ఉన్నాయి. గబగబా తినేసి, తన బేగ్‌లోని వాటర్‌బాటిల్ తీసి నీళ్లన్నీ తాగేసింది.

తలుపు గడియవేసి మంచం మీద వాలిపోయింది. ఓరగా తెరిచివున్న కిటికీ లోంచి విన్పిస్తున్న కీచురాళ్లరొద, చెట్లమీది పక్షుల రెక్కల టపటపల మధ్య భయం లోంచి నిద్రలోకి జారుకుంది.

కొండమీది ఆలయంలోని సుప్రభాతం, గుడిగంటల నాదానికి ఉలిక్కి పడిలేచింది పద్మ. తనెక్కడుందో కొంతసేపు అర్థం కాలేదు. వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. రాత్రి ఎవరూ వచ్చిన జాడలేదు. తను ఎవరింటికో వచ్చి నిద్రపోలేదు కదా!

తొలివెలుగు రేఖలు జగత్తునంతా ఆక్రమించుకుంటున్నాయి. గోడకి తగిలించి ఉన్న ఫోటోను చేతిలోకి తీసుకుని తలుపు తెరుచుకుని బైటికొచ్చింది పద్మ. ఫోటోలో కుర్చీల్లో కూర్చున్న వృద్ధ దంపతులు, వాళ్ల వెనక రెండు కుర్చీల మీదా రెండు చేతులు వేసి నిల్చున్న పదేళ్ల అబ్బాయి. పరిశీలనగా చూస్తే భార్గవ్ అని అర్థమౌతోంది.

తలుపుమీద నెంబరు మసకమసకగా 4-44. చాన్నాళ్లుగా ఇంట్లో ఎవరూ ఉండడం లేనట్టుంది చూస్తూంటే. పెరట్లోని మొక్కలన్నీసగం సగం ఎండిపోయి తలలు వాల్చేసాయి. అరటి చెట్ల మొదళ్లలోని పిలకల్నెవరో తవ్వుకునిపోయినట్టు మట్టి పెల్లిగించి ఉంది.

పొందికైన చిన్న డాబా ఇల్లు. రాత్రి తెలీలేదు కాని, చుట్టూ ఆవరించి ఉన్న పచ్చని కొండల మధ్య ప్రశాంతమైన వాతావరణం ఎంతో బావుంది. కాని ఈ ఒంటరితనమే ఏం బాగాలేదు.

ఫోటోని చేతుల్లో పట్టుకుని బెంగగా కూర్చుండిపోయింది పద్మ.

తూర్పునుండి ఎండ జరజరా పాక్కుంటూ వాకిట్లోకొచ్చింది. చింతచెట్లలోంచి గోలగోలగా పిల్లల అరుపులు వినపడ్డాయి. పద్మ గేటు దగ్గరికి నడిచి అటు చూసింది. నలుగురైదుగురు పిల్లలు చింతకాయలు ఏరుకుని భుజాలకి తగిలించుకున్న సంచుల్లో వేసుకుంటున్నారు. అందులో ఒకడు ఆదాటుగా ఇటు చూసాడు. మిగతా వాళ్లకేదో చెప్పేడు. అంతే, అందరూ అరుచుకుంటూ పారిపోయారు.

పద్మ టేబులు సొరుగులు లాగి చూసింది. తాళాలు వేసున్నాయి. బ్రష్ మీద పేస్ట్ వేసుకుని టేబుల్‌మీదున్న నీళ్లసీసా తీసుకుని బైటికొచ్చింది. మాసిన పంచె కట్టుకున్న రైతు ఒకతను గేటు తీసుకుని లోపలికొచ్చేడు. తొందరతొందరగా నడిచివచ్చినట్టున్నాడు, వగరుస్తున్నాడు.

"అమ్మగోరూ, నేను నాయుణ్నండి, సెమించాల, రోజూ రేత్రి ఇక్కడే తొంగుంటానండి, నిన్న పండక్కదండి..." చేతులు నలుపుకుంటూ నసుగు తున్నాడు.

"అందరూ వచ్చేసేరాండి" అని చొరవగా ముందు గదిలోకెళ్లి వెంటనే తిరిగొచ్చేడు.

"ఆరేరండి?" అన్నాడు.

"అదే నేనూ అడుగుతున్నాను, శాస్త్రిగారూ వాళ్లూ ఏరి?" అంది పద్మ.

"మీరారి సుట్టాలు కాదాండి? ఆరొచ్చేసేరనుకుని గుంటగాళ్లు సెప్తే పడతా లేత్తా లగెత్తుకొచ్చేనండి. ఈ ఇంటెనకాల అరిటితోట, ఇంటిముందు సింతసెట్లు అన్నీ నా ఇలాకాలోయేనండి. ఆరు పారొచ్చీదాకా ఇల్లు సూస్తుండమన్నారండి. ఇంతకీ మీరెవరండి?"

పద్మ విసుగ్గా చూసింది "ఎక్కడికెళ్లేరు వీళ్లు?"

"అప్పుడెప్పుడో యాత్తర్లకెల్లేరు గదండీ తల్లి ముగ్గురూని, ఆయాల ఎల్టం ఇయాల్టికింకా తిరిగి రానేదండి"

"ఎన్నాళ్లైంది?"

"అప్పుడెప్పుడో శాన్నాళ్లే అయ్యిందండి, గోదారి పుస్కరాలకి శానాముందు. పదిరోజుల్లో తిరిగొత్తావన్నోరు ఇయాల్టికింకా అజాపజానేరండి"

పద్మ గుండె గొంతుకలోకి వచ్చినట్లైంది. నిలబడలేక మెట్లమీద చతికిలపడింది. గోదావరి పుష్కరాలై ఏడాది దాటింది.

"అదేమిటి, ఊళ్లో ఎవరికైనా తెల్సా?"

"ఊరికింత దూరంలో ఉంటన్నారు కదండి, ఎవులికీ తెల్దండి. పెద్ద శాత్తుల్లుగారు వొయిసైపోయి కొండమీదికెల్టం లేదండి. సిన్నశాత్తుల్లు గారికి తండ్రిగారి ఉజ్జోగం రానేదండి"

"ఇంకెవరైనా బంధువులింటికి...."

"ఆరికాయబ్బాయి గారు తప్ప ఇంకెవలూ నేరండి. నేకనేక ముదివి కాలంలో పుట్టుకొచ్చేరు ఆరైనానండి" అన్నాడు మధ్యలోనే అందుకుని, "అయినా సుట్టాలింట్లో ఏళ్ల తరబడి ఉండిపోతారేటండి".

సింహాచలం బస్టాండ్ నుంచి బస్సు బయలు దేరింది.

కిటికీ పక్కనే కూర్చున్న పద్మకి మనసంతా మొద్దుబారిపోయినట్టుంది. భార్గవ్ రూపం కళ్ల ముందు నిల్చింది.

మూడేళ్ల క్రితం రాజమండ్రి నుంచి తను తిరుపతిలో ఉన్న పిన్నిగారింట్లో ఉండి డిగ్రీ చదువుకోడానికెళ్లింది. పక్కనే వేద కళాశాల హాస్టలుండేది. అందర్లోకి అతి బిడియస్తుడు భార్గవ్. సంస్కారం ఉట్టిపడే కళ్లు. పండుగ రోజుల్లో అతన్ని పిలిచి భోజనం పెట్టేది పిన్ని. పసిమిచాయలో మెరిసిపోయే అతన్ని చూస్తూ కళ్లు తిప్పుకోలేక పోయేది తను. తను వెళ్లిన ఏడాదికే అతని విద్యాభ్యాసం ముగిసింది. తమ ఇద్దరి మధ్య కొద్దిపాటి పరిచయాన్ని అలాగే ఉంచేసి వెళ్లడానికి సిద్ధమయ్యాడతను. పిన్నీ వాళ్లని సింహాచలం రమ్మని ఎడ్రస్ ఇచ్చాడు. తను నాలుగైదు ఉత్తరాలు రాసినా అతన్నుంచి జవాబు లేక

మానుకుంది. ఇప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలో పి.జి. చేస్తూ అతన్ని చూడాలనే కాంక్షను అణచుకోలేక...

పద్మకళ్లు జలపాతాలయ్యాయి.

ఎక్కణ్నుంచో అప్పుడెప్పుడో వచ్చిన టెలిగ్రాం కాయితం తన అజాగ్రత్త వల్ల పోయిందని నాయుడు చెప్పలేదు. పద్మకి తెలిసే అవకాశం లేదు –

*(2-3-2005 నవ్యవీక్లీ)*

కథా నిలయం
శ్రీకాకుళం